క్లుప్తంగా

తాగునీటి కోసం మహిళల ధర్నా


ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు శుక్రవారం సాయంత్రం రోడ్డుపై ధర్నా చేశారు. ఎస్సీకాలనీకి విద్యుత్ సరఫరా సక్రమంగా లేక బోర్‌వెల్ నడవడం లేదని, దీంతో నీటి ఎద్దడి ఏర్పడుతుందని వాపోయారు. గ్రామానికి విద్యుత్ లైన్‌మెన్‌ను నియమించకపోవడంతోనే ఈ సమస్య ఉందన్నారు. అధికారులు చర్యలు తీసుకొని విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని, నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములను కాపాడాలని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండేకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, చెరువు శిఖం భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, భూ విస్తీర్ణం వివరాలతో సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని కడెం కాలువ భూముల కబ్జాను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు స్వామిరెడ్డి, నాయకులు తిరుపతి, వెంకటరమణారావు, సత్యం, శేఖర్, మల్లేశ్, శ్రీనివాస్, రాజనర్సు, వెంకటరెడ్డి, అంకం శ్రీనివాస్, బాపు, గట్టయ్య పాల్గొన్నారు.

'ప్రజాసమస్యలు పట్టించుకోని అధికారులు'

చెన్నూర్: మున్సిపాలిటీలో రోడ్లు, మురికి కాలువలు అధ్వానంగా మారాయని, ప్రజాసమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శుక్రవారం చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని మారెమ్మవాడ, బేతాళవాడ, మున్సిపల్ రోడ్డు, మసీదురోడ్డు, కోటబొగుడ, లైన్‌గడ్డ, పోచమ్మవాడలలో సీపీఎం నాయకులు పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీలు లేక నీరు రోడ్లపై చేరి కాలనీల్లో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. జిల్లా కమిటీ సభ్యులు చందు, రవి, నగేశ్, శ్రీనివాస్, ఉమారాణి, రమాదేవి, కుమార్, మధుకర్, జ్యోతి, సత్యం పాల్గొన్నారు.

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అర్కలవాడ 3 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ జి. భాగ్యలక్ష్మీ, ఏఎన్‌ఎం స్వప్న తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

జైపూర్: మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, వైద్యాధికారి ముస్తఫా, శ్రావ్య పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమన్నారు. హెచ్‌ఎం సాయి దీపిక, అంగన్‌వాడీ టీచర్ కళావతీ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తాండూర్: మండలంలోని ద్వారకాపూర్, కాసిపేట గ్రామపంచాయతీలలో జరుగుతున్న పారిశుధ్య పనులను మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. మురికి కాలువల్లో పూడిక తీయించాలని, రోడ్లపై ప్లాస్టిక్, చెత్త లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో శుక్రవారం డ్రైడే పనులు నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, వైస్‌చైర్మన్ నవాజీల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిని తొలగించారు. దోమలు వృద్ధి చెందకుండా నీటి గుంతలలో ఆయిల్‌బాల్స్ వేశారు. మురికి కాలువలలో బైటెక్స్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు.

సీఎం కార్యక్రమానికి తరలిన ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమానికి పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు మంచిర్యాల నుంచి తరలివెళ్లారు. జిల్లా నుంచి స్కూల్ అసిస్టెంట్‌లు, భాషా పండితులు, పీఈటీలు 542 మంది కోసం ఏర్పాటు చేసిన 14 బస్సులను డీఈవో యాదయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఎంఈవోలు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

నత్తనడకన పనులు..!

- ఏడాదిగా కొనసాగుతున్న రోడ్డు పనులు
- వర్షాల నేపథ్యంలో రోడ్డుపై బురద
- వాహనదారులు, పాదచారులకు తప్పని తిప్పలు


నిలిచిన రోడ్డు పనులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో చేపడుతున్న పనులు నెమ్మదిగా సాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు పూర్తికావడం లేదు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన పనులను పూర్తి చేయడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా వారిపై మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వరుసగా ఎన్నికలు రావడాన్ని సాకుగా చూపించి కాంట్రాక్టర్లు పనులు చేయకపోవడంతో, వేసవికాలంలోగా పూర్తి కావాల్సిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో వర్షాకాలంలో మున్సిపల్‌వాసులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

పూర్తికాని పనులు..

మంచిర్యాల పట్టణానికి టూటౌన్‌గా పిలిచే హమాలీవాడ ప్రాంత ప్రజలకు రోడ్ల కష్టాలను తీర్చేందుకు మున్సిపల్ మాస్టర్‌ప్లాన్‌ను అనుసరించి హమాలీవాడ భాగ్యలక్ష్మీ చికెన్ సెంటర్ నుంచి తిలక్‌నగర్ క్రాస్‌రోడ్డు వరకు చేపట్టిన 60 ఫీట్ల రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌తో కూడిన పనులను గత ఏడాది జనవరి 27వ తేదీన ప్రారంభించారు. ఇందుకు టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.5.85 కోట్లు కేటాయించగా గత ఏడాది వేసవిలోపు పనులను పూర్తి చేయాల్సి ఉంది. రోడ్డు వెడల్పులో ఇళ్లను కోల్పోయిన వారితో పాటు, రోడ్డును ఆక్రమించిన కొన్ని ఇళ్ల తొలగింపులో అధికారులు చర్యలను తీసుకోకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. పెద్ద సంఖ్యలో ఇళ్లను కోల్పోతున్న వారి కోరిక మేరకు అధికారులు 60 ఫీట్ల రోడ్డును 55 ఫీట్లకు తగ్గించారు. అయినప్పటికీ కొన్ని ఇళ్లు రోడ్డు వెడల్పులో పోతుండడంతో పనులు చేయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో పనులు జరగడంలేదు. అప్పటికే రోడ్డును తవ్వి వదిలేయడంతో ఏడాదిన్నరగా టూటౌన్ ప్రాంతానికి వెళ్లే ప్రజలకు సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు తాగునీటి పైపులు పగిలి తాగునీటికి సైతం తిప్పలు తప్పడం లేదు. ఇటీవలే డ్రెయినేజీ పనులు పూర్తి చేసినా, రోడ్డు వేయడంలో మాత్రం జాప్యం జరుగుతోంది. దీంతో వర్షాలకు రోడ్డుపై గుంతలు పడడంతో పాటు బురదమయంగా మారి వాహనదారులు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలోని దాదాపు సగం జనాభా టూటౌన్ ప్రాంతంలో ఉండగా రోడ్డు పనులను పూర్తి చేస్తే పట్టణ ప్రజలు రాకపోకలు సాగించేందుకు సజావుగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

పనులు వేగవంతం చేస్తాం



మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడ నుంచి తిలక్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు వెడల్పు పనులు సగం పూర్తయ్యాయి. వర్షాలు కురుస్తుండడంతో పనులకు విరామం వచ్చింది. వర్షాలు తగ్గితే వేగవంతంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక చర్యలు చేపడుతున్నాం.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

'మొక్కలతోనే మానవ మనుగడ'


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వినోద్, అధికారులు

బెల్లంపల్లిరూరల్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంచిర్యాల జిల్లా డీఎఫ్‌వో శివ్ ఆశీష్ సింగ్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి రేంజ్ పరిధి పాతబెల్లంపల్లి అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక అధికారులతో కలిసి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఎఫ్‌డీవో విజయ్ కుమార్, ఎఫ్ఆర్‌వో సుభాష్, డీఆర్‌వోలు గౌరీశంకర్, ప్రవీణ్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి, నాయకులు రమేశ్, రమేశ్ బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీపడేది లేదు..

నెన్నెల: బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, నూతన భవనాలు ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలకు రహదారులు, వంతెనల సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం మండలంలోని బొప్పారం బస్టాఫ్ నుంచి గ్రామంలోకి రూ.80 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టనున్న బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లంబాడితండా ఎర్రవాగుపై రూ.2 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టనున్న వంతెన నిర్మాణానికి, మండల కేంద్రంలో రూ.30 లక్షలతో చేపట్టే సీసీరోడ్డు నిర్మాణానికి, హైస్కూల్‌లో రూ.2 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసే మంచినీటి బోరుకు, కేజీబీవీలో రూ.5 లక్షలతో చేపట్టే కిచెన్‌షెడ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మండల కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ స్టాఫ్ నర్సు క్వార్టర్, నెన్నెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం 32 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. వడ్లవాడలో నీటి ఎద్దడి సమస్య పరిష్కరించాలని మహిళలు వినతిపత్రం అందజేశారు. ఆర్డీవో హరికష్ణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేశ్, గొల్లపల్లి, హరీశ్ గౌడ్, రమేశ్, సుజాత, నాయకులు శ్రీనివాస్, మల్లిక, తారాచంద్, మల్లాగౌడ్, మహేశ్వర్‌రెడ్డి, మహ్మద్‌జలీల్, పోచిరెడ్డి, గట్టు బానేష్, గోవింద్‌సింగ్, గజేందర్, మొహిద్‌ఖాన్‌లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. స్పెషల్ డ్రైలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనదారులకు శుక్రవారం పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మైనర్లకు ఎవరూ వాహనాలు ఇవ్వొద్దన్నారు. లైసెన్స్‌లు, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సైలు సుబ్బారావు, శ్వేత పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పుతో సంబరాలు


బెల్లంపల్లి: క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి/రామకృష్ణాపూర్/దండేపల్లి /పాతమంచిర్యాల /వేమనపల్లి/భీమిని /మంచిర్యాలరూరల్ (హాజీపూర్) /మందమర్రిరూరల్ /మంచిర్యాల టౌన్/లక్సెట్టిపేట: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునివ్వడంతో శుక్రవారం జిల్లాలోని మండలాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఆయా మండలకేంద్రాల్లో అంబేడ్కర్ విగ్రహంతో పాటు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బెల్లంపల్లిలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మందమర్రి పట్టణంలో ఆదిజాంబవ సంఘం నాయకులు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కోటపల్లి: బ్యాంకింగ్ తరహాలో తపాలా శాఖ ఎన్నో సేవలు అందిస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రామరావు అన్నారు. మల్లంపేటలో శుక్రవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు జరిగింది. రామారావు మాట్లాడుతూ ప్రతీ కుటుంబం పొదుపు ఖాతా ప్రారంభించాలని సూచించారు. ఎస్పీఎం రాజబాబు, ఓవర్సీస్ భరత్‌కుమార్, శ్రావణ్, బీపీఎంలు పాల్గొన్నారు.

తాండూర్: పోస్టాఫీస్ ఆధ్వర్యంలో అందుతున్న సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సూచించారు. శుక్రవారం మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో గ్రామస్తులకు పోస్టల్ సేవలపై అవగాహన కల్పించారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో అందుతున్న ప్రమాదబీమా సౌకర్యం, పొదుపు ఖాతాలపై గ్రామస్తులకు వివరించారు. స్థానిక బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ అంజన్న, మాజీ సర్పంచ్ శారద, పోస్టల్ సిబ్బంది అబ్దుల్లా, గోపాల్, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

బెల్లంపల్లి: ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా రైతులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' 'కర్షకులకు కరెంట్ కష్టాలు' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని చంద్రవెల్లి, చర్లపల్లి శివారు ప్రాంతాల్లో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు విద్యుత్ ఏఈ రామ్‌మనోహర్ రైతుల సమక్షంలో శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న విద్యుత్‌వైర్లను సరి చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటును బెల్లంపల్లి రూరల్ ఏడీఈ కె. శ్రీనివాస్ పర్యవేక్షించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

లక్సెట్టిపేట: వర్షాకాలం కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి తలమల, మన్నెగూడ గ్రామాలలో వెంకట్రావుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మాట్లాడారు. ఎంపీడీవో సరోజ, వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వెంకటరమణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి: వర్షాకాలంలో దోమలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని కోటపల్లి ప్రాథమిక వైద్యురాలు డాక్టర్ అరుణశ్రీ అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో శుక్రవారం దోమల మందు పిచికారీ చేయించారు. అనంతరం అరుణ శ్రీ పాఠశాలల పరిసరాలను పరిశీలించి దోమలు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలో శుక్రవారం మండల ప్రత్యేకాధికారి గంగారాం సుడిగాలి పర్యటన చేశారు. దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఆదివాసీ గ్రామం రాంపూర్‌లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించారు. దేవాపూర్ ఎంపీపీఎస్, జిల్లా పరిషత్ పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం, టాయిలెట్స్ పరిశీలించారు. ఫర్టిలైజర్ షాపు తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ఎంపీవో సఫ్దర్ అలీ, వ్యవసాయాధికారి వందన, హెచ్‌ఎం రమేశ్ రాథోడ్, పంచాయతీ కార్యదర్శి కవిత, సిబ్బంది ఉన్నారు.

జీవన ప్రమాణాల పెంపునకు 'స్వచ్ఛదనం –పచ్చదనం'

జన్నారం: స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని డీఆర్డీవో, మండల ప్రత్యేక అధికారి కిషన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ శాఖల సిబ్బందితో స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో శశికళ, ఎంఈవో విజయ్‌కుమార్, ఏవో సంగీత, ఏపీవో రవీందర్, ఈసీ విలాస్, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య, విద్య, పంచాయితీ, అంగన్‌వాడీ, ఆశ, ఉపాధిహామీ, ఐకేపీ సిబ్బందికి ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపులు కార్యక్రమంపై వివరించారు. గ్రామాల్లో వనమహోత్సవం కింద మొక్కలు నాటాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎంఈవో రాధాకృష్ణమూర్తి, వైద్యాధికారులు ముస్తఫా, శ్రావ్య, ఇందారం పాఠశాల హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటపల్లి: తెలంగాణ ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు

కోటపల్లి: మావోయిస్టులకు సహకరించిన, ఆశ్రయం కల్పించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజేందర్ హెచ్చరించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్సై రాజేందర్, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి బొప్పారంలో సందర్శించి గ్రామంలోని సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి, మద్యానికి అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మాజీ సర్పంచ్ సతీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయిని అరికట్టాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై గోపతి సురేశ్ అన్నారు. శుక్రవారం గుడిపేట మౌంట్‌కార్మల్ పాఠశాలలో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

శ్రీరాంపూర్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ తెలిపారు. శుక్రవారం ఆయన కృష్ణకాలనీలోని కేరళ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు.

నేరాల నియంత్రణకే 'పల్లె నిద్ర'

భీమిని: నేరాల నియంత్రణకే గ్రామాల్లో పల్లెనిద్ర చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి భీమిని మండలం చిన్నగుడిపేట గ్రామంలో పల్లెనిద్ర చేశారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏఎస్సై రంగు తిరుపతి, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

దండేపల్లి: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని, జిల్లా దళిత అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. దండేపల్లి మండలం కొర్విచెల్మలో జిల్లా వయోజన విద్య ఆధ్వర్యంలో, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సౌజన్యంతో వంద రోజుల్లో వందశాతం అక్షరాస్యత, మహిళలకు కుట్టుశిక్షణ కార్యక్రమాల నిర్వహణపై స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్నయ్యకు ప్రొఫార్మాను అందించారు. జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ప్రకాశం, డీఆర్పీ జనార్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం ఇన్‌చార్జి ఎంపీవోగా జలంధర్

జన్నారం: జన్నారం ఇన్‌చార్జి మండల పంచాయతీ అధికారిగా జలంధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రమేశ్ వేములవాడరూరల్‌కు బదిలీ కాగా ధర్మారం పంచాయతీ కార్యదర్శి జలంధర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు.

ముత్యంపేటలో కళాజాత

దండేపల్లి: మండలంలోని ముత్యంపేటలో సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో కళాకారులు శుక్రవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు పాటల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రైతు రుణమాఫీ, మహాలక్ష్మీ పథకం, ఉచిత విద్యుత్, రూ.500 కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల అమలు తీరును వివరించారు. కళాకారులు రమేశ్, మురళీ, శ్రీనివాస్, కిష్టయ్య, రవీందర్, సత్యనారాయణ, కృష్ణ, నాగలక్ష్మీ, సంధ్య పాల్గొన్నారు.

'అక్రమ కేసులు పెట్టడం సరికాదు'

దండేపల్లి: బీజేపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గుడిరేవు మాజీ సర్పంచ్, బీజేపీ మహిళ మోర్చ ప్రధాన కార్యదర్శి మంజుబార్గవిపై ఇటీవల అక్రమ కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమెను బీజేపీ జిల్లా నాయకులు శుక్రవారం కలుసుకున్నారు. మున్నారాజ్, నరేశ్, విజయ్, అశోక్‌వర్దన్ ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నస్పూర్: పట్టణ పరిధిలోని విలేజ్ నస్పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని పలు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఈదునూరి అభినవ్, జిల్లా పీడీఎస్‌యూ కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా ఏఐఎస్‌బీ కన్వీనర్ సన్నీగౌడ్‌లు విద్యార్థులతో కలిసి పాఠశాల ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. నాయకులు అరవిందరెడ్డి, తిరుపతి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బురదలో కూరుకుపోయిన వాహనం


బురద నుంచి వాహనాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని తుర్కపల్లి గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రహదారి మట్టిరోడ్డు కావడంతో గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో మట్టిరోడ్డు బురదమయంగా మారింది. పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్లే టాటాఏసీ వాహనం శుక్రవారం బురదలో కూరుకుపోయింది. స్థానికులు బురదలో కూరుకుపోయిన వాహనాన్ని బయటకు తీశారు. ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సంతోష్

చెన్నూర్‌రూరల్: తెలంగాణ మున్నూరు కాపు సంఘం చెన్నూర్ మండలం సోషల్ మీడియా ఇన్‌చార్జిగా మండలంలోని సుబ్బరాంపల్లి గ్రామానికి చెందిన తుపాకుల సంతోష్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎర్రం సంజీవ్ పటేల్ తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల మండల అధ్యక్షుడిగా శ్యాంసుందర్‌రెడ్డి

చెన్నూర్: పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెతుల రాజేంద్ర పాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ హాజరయ్యారు. సమావేశంలో చెన్నూర్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కోర్రాళ్ల శ్యాంసుందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఖాజా ఖంరోద్దీన్, కోశాధికారిగా సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మహ్మద్ ఇబ్రహీం జలాల్, సంయుక్త కార్యదర్శి మణినడార్, ప్రచార కార్యదర్శిగా శ్రావణ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్, ఆనీశ్, అశోక్, రమ, పున్నం చందలు ఎన్నికయ్యారు.

బియ్యం పంపిణీ సజావుగా చేపట్టాలి

తాండూర్: రేషన్ బియ్యం పంపిణీ సజావుగా చేపట్టాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ రేషన్ డీలర్లకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. బియ్యం పంపిణీ డీలర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, అంజన్‌కుమార్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్: మందమర్రి మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్షుడు రాంచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లి, ఆస్నాద, కొమ్మెర, పొక్కూరు గ్రామాలలో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ భాస్కర్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ వీల్‌చైర్ల పంపిణీ

మంచిర్యాలటౌన్: జిల్లాలోని పలువురు దివ్యాంగులకు శుక్రవారం జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బ్యాటరీ వీల్‌చైర్లను జిల్లా సంక్షేమశాఖ సీనియర్ అసిస్టెంట్ కౌశల్య అందించారు. జిల్లాకు చెందిన సూరం పవన్‌కుమార్, మాదరబోయిన చంద్రశేఖర్, కటకం శంకర్, బోర శేఖర్, కన్నం నారాయణలకు బ్యాటరీ వీల్‌చైర్లను పంపిణీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ రవికాంత్, ఎఫ్ఆర్‌వో ఫర్హాన, డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ సమన్వయకర్త సౌజన్య, విజయ, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్తలు శ్యామల, రజిత పాల్గొన్నారు.

రేపు ఆషాఢమాస బోనాల జాతర

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ శ్రీరాంనగర్ ఆదిపరాశక్తి భువనేశ్వరి మాత దేవాలయంలో ఆదివారం ఆషాఢమాస బోనాల జాతర నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు వంగల దయానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కస్తూర్బాలో ఘనంగా వేడుకలు

దండేపల్లి: మండల కేంద్రం సమీపంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో జరుపుకునే బోనాల వేడుకల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. బోనాలు, పోతురాజుల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సద్వినియోగం చేసుకోండి

వేమనపల్లి: మండలంలో వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతులు మీ సేవా కేంద్రంలో సంప్రదించి దరఖాస్తులు అందించి ఫిర్యాదులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భీరన్న తెలిపారు. రైతు సమాచార పత్రం, 1 -12 -2023 నుంచి నేటి వరకు రుణ ఖాతా స్టేటస్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులు, పట్టాదారు పాస్ పుస్తకాలను దరఖాస్తుకు జత చేసి రైతు వేదికల్లోని గ్రీవెన్స్‌లో ఇవ్వాలని సూచించారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

నస్పూర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని నాయకులు సీసీసీ కార్నర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. రమేశ్, రాజన్న యాదవ్, శ్రీపతి రాములు, సతీశ్, భీంసేన్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను అవమానించిన కేంద్రమంత్రి క్షమాపణ చెప్పాలి'

పాతమంచిర్యాల: పార్లమెంటు వేదికగా దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సమాజాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ బీసీలకు క్షమాపణ చెప్పాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో కేంద్ర మంత్రికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల :
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899